

సీఎం రేవంత్‌ను కలిసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్





అనంత పద్మనాభస్వామి ఆలయం వద్ద భక్తుల సందడి



అనంతగిరిలో యువత కేరింతలు





కీసరగుట్ట ఆలయంలో భక్తుల క్యూ

న్యూ ఇయర్ హంగామా

వికారాబాద్/కీసర, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకలను వికారాబాద్, మేడ్చల్ జిల్లాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. డిసెంబరు 31న అర్ధరాత్రి నుంచి విందులు, వినోదాలు, కేరింతలు, నృత్యాలతో కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. నూతన సంవత్సరం రోజు ఉదయాన్నే లేచి ఆలయాలకు వెళ్లారు. కొత్త ఏడాదిలో అంతా మంచే జరగాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తెల్లవారుజామునే ఇళ్ల ఎదుట రంగవల్లులను అందంగా తీర్చిదిద్ది 2024కు స్వాగతం పలికారు. న్యూ ఇయర్ సందర్భంగా కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి, అనంతపద్మనాభ స్వామి, చీర్యాల్ లక్ష్మీనరసింహస్వామి, పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి తదితర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అనంతగిరులు, కోట్‌పల్లి ప్రాజెక్ట్‌కు సందర్శకుల తాకిడి పెరిగింది. కాగా సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళిసైను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన వేడుకల్లో మద్యం ఏరులై పారింది. న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా డిసెంబరు 31 అర్ధరాత్రి వరకు మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు తెరిచి ఉండడంతో ఎక్కువ మొత్తంలో మద్యం విక్రయాలు జరిగాయి. మద్యం ప్రియులు తెగ తాగేశారు. ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాల్లో సరికొత్త రికార్డులు నమోదయ్యాయి.





తగ్గేదే లే!



ఉమ్మడి జిల్లాలో మూడు రోజుల్లో రూ.208.23 కోట్ల మద్యం అమ్మకాలు

న్యూ ఇయర్ వేడుకల్లో ఏరులై పారిన మద్యం

- రంగారెడ్డి జిల్లాలో రూ.107.64 కోట్లు
- మేడ్చల్ జిల్లాలో రూ. 91.44 కోట్లు
- వికారాబాద్ జిల్లాలో రూ.9.15 కోట్ల అమ్మకాలు
- అత్యధికంగా శేరిలింగంపల్లి ఎక్సైజ్ పరిధిలో రూ.34.38 కోట్ల అమ్మకాలు
- అత్యల్పంగా వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్‌లో రూ 82 లక్షల సేల్
- ఆబ్కారీ శాఖకు దండిగా ఆదాయం

వికారాబాద్/మేడ్చల్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) జనవరి1 : న్యూ ఇయర్ తెచ్చిన కిక్కుతో మద్యం ప్రియులు తెగ తాగేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మద్యం ఏరులై పారింది. డిసెంబరు 31 సందర్భంగా మద్యం ప్రియులు మత్తులో మునిగి తేలారు. ప్రభుత్వ ఖజానాపై కాసుల వర్షం కురిపించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తెలంగాణలోనే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మద్యం అమ్మకాల్లో సరికొత్త రికార్డును సృష్టించింది. గతేడాది న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా జరిగిన లిక్కర్ అమ్మకాలను పోల్చి చూస్తే ఈసారి రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయి. గత ఏడాది న్యూ ఇయర్ సందర్భంగా డిసెంబరు 29 నుంచి 31 వరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రూ.190.31 కోట్ల అమ్మకాలు జరగగా, ఈ సారి డిసెంబరు 29 నుంచి 31వ తేదీ వరకు రూ.208.23 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. న్యూ ఇయర్ సందర్భంగా అర్ధరాత్రి 12గంటల వరకు లిక్కర్ షాపులు, వైన్స్‌లకు అనుమతి ఇవ్వడం, బార్లు ఒంటి గంట వరకు ఓపెన్ ఉండటంతో మద్యం ప్రియులు పండుగ చేసుకున్నారు. పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో మద్యం షాపులు మూడు రోజుల పాటు కిటకిటలాడాయి. హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు, దాబాలు, ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌ల్లో మద్యం ప్రియులు మత్తులో చిందులేశారు. కొత్త సంవత్సరానికి మత్తుగా స్వాగతం పలికారు. మీడియం బ్రాండ్ 29,812 కాటన్లు, ప్రీమియం బ్రాండ్ 1,50,155 కాటన్ల అమ్మకాలు జరిగాయి. మద్యం అమ్మకాల్లో అత్యధికంగా ఐఎంఎల్ కాటన్లు, బీరు కాటన్లు ఎక్కువగా ఉన్నాయి. 1,79,967 ఐఎంఎల్ కాటన్లు, 1,77,134 కాటన్ల బీర్ల అమ్మకాలు జరిగాయి.

రంగారెడ్డి జిల్లాలో వంద కోట్లకు పైగా..

నూతన సంవత్సర వేడుకల్లో మద్యం ప్రియులు తగ్గేదేలే అంటూ తెగ తాగేశారు. కేవలం మూడు రోజుల్లోనే రంగారెడ్డి జిల్లాలో రూ.107.64 కోట్లు విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. అలాగే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రూ. 91.44 కోట్లు, వికారాబాద్ జిల్లాలో రూ.9.15కోట్ల అమ్మకాలు జరిగాయి.

అత్యధికంగా ఎస్‌ఎల్‌పీలో..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లిలో అత్యధికంగా మద్యం అమ్మకాలు జరిగాయి. మీడియం బ్రాండ్ 3,661 కాటన్లు, ప్రీమియం బ్రాండ్ 19,651 కాటన్లు, ఐఎంఎల్ 23,312 కాటన్లు, బీర్లు 25,204 కాటన్లు అమ్మకాలు జరిగాయి.వీటి విలువ రూ.34.38 కోట్లు ఉంటుంది. అత్యల్పంగా వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో రూ.82లక్షల అమ్మకాలు జరిగాయి. మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 30మద్యం దుకాణాలుండగా, ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 41మద్యం దుకాణాలు, 50 బార్లున్నాయి. ఆదివారం ఒక్కరోజే మేడ్చల్ పరిధిలోని 30మద్యం దుకాణాల్లో1.80కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగగా, ఘట్‌కేసర్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్‌లలో రూ. 9.45కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి.

2023 డిసెంబరు 29 నుంచి 31వరకు మద్యం అమ్మకాల వివరాలు (జిల్లాల వారీగా)

ఎక్సైజ్ స్టేషన్ పేరు	మీడియం బ్రాండ్	ప్రీమియం బ్రాండ్	ఐఎంఎల్ కాటన్లు	బీరు కాటన్లు	అమ్మకాలు (రూ.కోట్లలో)
మేడ్చల్ జిల్లా					
మేడ్చల్	1,321	4,974	6,295	5,395	6.48
కుత్బుల్లాపూర్	3,686	16,263	19,949	16,874	21.43
బాలానగర్	2,218	14,101	16,319	15,337	18.78
మల్కాజిగిరి	988	6,488	7,476	7,411	8.47
ఉప్పల్	1,830	12,351	14,181	11,770	16.48
ఘట్‌కేసర్	3,283	14,951	18,234	17,496	19.80
మొత్తం	13,326	69,128	82,454	74,283	91.44
రంగారెడ్డి జిల్లా					
సరూర్‌నగర్	1,948	12,065	14,013	15,457	17.28
హయత్‌నగర్	1,329	9,783	11,112	12,382	13.33
ఇబ్రహీంపట్నం	532	3,181	3,713	4,813	4.03
మహేశ్వరం	690	2,609	3,299	2,977	3.50
ఆమనగల్లు	343	1,792	2,135	2,834	2.13
షాద్‌నగర్	1,517	4,450	5,967	6,247	5.59
శంషాబాద్	3,320	13,663	16,983	15,441	19.93
శేరిలింగంపల్లి	3,661	19,651	23,312	25,204	34.38
చేవెళ్ల	1,265	5,915	7,180	6,762	7.47
మొత్తం	14,605	73,109	87,714	92,117	107.64
వికారాబాద్ జిల్లా					
వికారాబాద్	416	2,246	2,662	2,874	2.70
పరిగి	353	1,388	1,741	2,320	1.60
తాండూరు	838	2,636	3,474	2,587	2.98
మోమిన్‌పేట్	133	717	850	1,191	0.82
కొడంగల్	141	931	1,072	1,762	1.05
మొత్తం	1,881	7,918	9,799	10,734	9.15
ఉమ్మడి జిల్లా వివరాలు (మొత్తం)					
మొత్తం	29,812	1,50,155	1,79,967	1,77,134	208.23



పెరిగిన చలి తీవ్రత

- తాళ్లపల్లిలో 10.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

రంగారెడ్డి అర్బన్, జనవరి1 : ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఉదయం పొగ మంచు కమ్ముకుంటోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సోమవారం రంగారెడ్డిజిల్లా షాబాద్ మండలం తాళ్లపల్లిలో 10.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమైంది. వికారాబాద్ జిల్లామర్పల్లిలో 11.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మౌలాలిలో 12.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



వేతనాల్లేక రెండు నెలలుగా ఇక్కట్లు

తాండూరు, జనవరి 1: తాండూరు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుల సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యారు. రెండు నెలలుగా వారికి వేతనాలు రావడంలేదని వాపోతున్నారు. మున్సిపాలిటీలో సుమారు 215 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున రెండు నెలల వేతనం రావాల్సి ఉంది. ఈ లెక్కన మున్సిపల్ కార్మికులకు మొత్తంగా రూ.64.5 లక్షల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. నవంబరు మాసానికి సంబంధించి ట్రెజరీ ద్వారా చెక్కు వేయడంతో వివిధ కారణాలతో ఫ్రీజింగ్ పేరిట చెక్కు రావడం లేదు. జనరల్ చెక్కు ఇస్తే సకాలంలో వేతనాలు వచ్చేవి. ఉన్నవి జనరల్ కాంట్రాక్టర్లకు చెల్లించడంతో కార్మికులకు రావాల్సిన వేతనాలు సకాలంలో రావడం లేదు. రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వేతనాలు రాకపోవడంతో అప్పులు చేయడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు.



శ్రీరామ జన్మభూమి అక్షింతల వితరణ

పరిగి, జనవరి 1: శ్రీరామ జన్మభూమి అక్షింతల వితరణ కార్యక్రమం సోమవారం పరిగిలో జరిగింది. రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు పిలుపు మేరకు ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో శ్రీరామ జన్మభూమి అక్షింతలు సోమవారం పరిగిలోని మూడవ వార్డులో పూజిత అక్షంతల కలశ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామ జన్మభూమి అక్షింతలను గడపగడపకూ తీసుకెళ్తామని తెలిపారు. అయోధ్యలో శ్రీరామ మందిరం ఆవిష్కరణ నాటికి దేశంలోని ప్రతీ గడపకు అక్షింతలు చేరేందుకు పని చేస్తున్నామని తెలిపారు.



పరిగిలో శ్రీరామ జన్మభూమి అక్షింతల వితరణలో బీజేపీ పట్టణ కార్యదర్శి వార్ల ఆంజనేయులు

శిఖం భూమి కబ్జాకు యత్నం



నిరసన వ్యక్తం చేస్తున్న వెంకటయ్య, కార్మికులు

దోమ, జనవరి 1: మండలంలోని దిర్సంపల్లి కుడి చెరువు శిఖం భూమి కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. గ్రామస్థులతో కలిసి సోమవారం దోమ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుడి చెరువు శిఖం భూమి కబ్జాకు పాల్పడుతున్నాడని పలుమార్లు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు శిఖం భూమి కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సత్యం, నాయకులు సత్తయ్య, శేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన



సాల్విడ్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

కులకచర్ల, జనవరి 1: మండలంలోని బండ వెల్కిచర్ల, సాల్విడ్ గ్రామాల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో వికసిత్ భారత్‌లో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై సోమవారం ఎల్ఈడీ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సతీశ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా మహిళలకు ఉచితంగా ఉజ్వల గ్యాస్, ఉచిత రేషన్‌బియ్యం, ముద్రరుణాలు, ప్రధానమంత్రి జీవనజ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష యోజన పథకాల్లో ప్రతీ సంవత్సరం రూ.342చెల్లిస్తే రూ.2లక్షల బీమా సౌకర్యం వర్తిస్తుందన్నారు. ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న పేదలకు ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ద్వారా వైద్యఖర్చుల నిమిత్తం రూ.10లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతీరైతుకు ఏడాదికి రూ.6వేలు, డ్వాక్రా మహిళలకు రుణాలు అందుతున్నాయన్నారు. మహిళలకు పావలావడ్డీ రుణాలతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి, వికసిత్ భారత్ మండల కోఆర్డినేటర్ శ్రీనివాస్, సాల్విడ్ సర్పంచ్ బాలయ్య, యువ మోర్చా మండల అధ్యక్షుడు గడుసు మహిపాల్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు



డైరీని ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

యాలాల, జనవరి 1: యాసంగి సీజన్‌లో రైతులకు ఎరువులను, వరివిత్తనాలను అందుబాటులో ఉంచినట్లు యాలాల మండల కేంద్రంలోని రైతు ఉత్పత్తి దారుల సంస్థ ఛైర్మన్ శివయ్య అన్నారు. యాలాలలోని తమ సంస్థ ఆవరణలో సోమవారం 2024 సంవత్సరానికి సంబంధించి డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యాలాల మాజీ సర్పంచ్ రవీందర్, డైరెక్టర్లు బస్వరాజ్, రాజేందర్, హన్మంత్, చంద్రారెడ్డి, సీఈవో అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై నేడు రైతులకు అవగాహన

కొడంగల్, జనవరి 1: పంటల సాగులో రైతులు పాటించాల్సిన మెళకువలపై మంగళవారం స్థానిక కేఎస్‌వీ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కొడంగల్ పట్టణంలోని ఓం ట్రెడింగ్ కంపెనీ నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎకరానికి 100 బస్తాలు వరి దిగుబడే లక్ష్యంగా నిపుణుల ద్వారా అధిక దిగుబడులు పొందేందుకు సంపూర్ణ పోషకాలు, మేలైన పద్ధతుల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. రైతులు అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7032527852 సెల్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

ఆమనగల్లు, జనవరి 1: పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఇందిరమ్మ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. కోనాపూర్‌నకు చెందిన టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి అండెకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీలు, క్యాలెండర్లను సోమవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తుందన్నారు. ఈ నెల 6 వరకు పేదలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే చట్టాలు, న్యాయ వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు న్యాయవాదులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అర్థం నర్సింహ, పోలెపల్లి సర్పంచ్ బాల్‌రామ్, ఉపసర్పంచ్ అంజన్‌రెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, భగవాన్‌రెడ్డి, రాజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, పర్వతరెడ్డి, దశరథరెడ్డి, బాబ, డేవిడ్, రామకృష్ణ పాల్గొన్నారు.


అంబేడ్కర్ జీవిత చరిత్రపై ప్రదర్శిస్తున్న నాటకం

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి

చేవెళ్ల, జనవరి 1: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతొక్కరూ కృషి చేయాలని చేవెళ్ల సర్పంచ్ శైలజఆగిరెడ్డి అన్నారు. చేవెళ్లలోని బాలుర పాఠశాలలో అంబేడ్కర్ జీవిత చరిత్రపై సోమవారం 'సంఘం శరణం గచ్ఛామి' నాటకాన్ని ప్రదర్శించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. బడుగులపై వివక్షను రూపుమాపాలన్నారు. అంబేడ్కర్ జీవిత విశేషాలతో కూడిన నాటకాన్ని ప్రదర్శించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో దళితరత్న అవార్డీ బి.ప్రభాకర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి సామెల్, వెల్ఫేర్ అధికారులు మాధవి, సురేశ్, జయప్రద, పాండు, టీచర్ సుధాకర్, నాయకులు యాదయ్య, సత్యనారాయణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలు అంబేడ్కర్ మార్గంలో నడవాలి


మాట్లాడుతున్న విశారదన్

కందుకూరు, జనవరి 1: బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గంలో మాదిగలు నడవాలని ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ అన్నారు. మాదిగ జాగృతి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ భీమ్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన 24వేల కిలోమీటర్ల పాదయాత్ర సోమవారం రాత్రి లేమూరు ఉంచి ప్రారంభమైంది. సభలో విశారదన్ మాట్లాడారు. మాదిగలో ఆత్మన్యూనత భావాన్ని తొలగించేందుకే పాదయాత్ర చేస్తున్నట్టు తెలిపారు. నాలుగేండ్లుగా అన్ని మాదిగ కాలనీల్లో పర్యటించానన్నారు. తాను చేపట్టిన పాదయాత్ర కందుకూరు నుంచి ప్రారంభించి ఇదే మండలంలో ముగిస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంజయ్య, రవీందర్, యాదగిరి, బి.సుధాకర్, వెంకటేష్, రవికాంత్, ఆంజనేయులు, బాలరాజ్, మహిపాల్, నరేష్ పాల్గొన్నారు.


ఇత్తడి తొడుగు దర్వాజకు పూజచేస్తున్న ఎంపీ రవీంద్ర కుమార్

ఉత్తర ద్వారానికి ఇత్తడి తొడుగు

షాద్‌నగర్ అర్బన్, జనవరి 1: షాద్‌నగర్ పట్టణానికి ముఖద్వారంగా వెలిసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఉత్తర ద్వారానికి ఇత్తడి తొడుగు చేయించారు. అజ్ఞాత భక్తుడు చేయించిన ఇత్తడి తొడుగుకు సోమవారం టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ పూజలు నిర్వహించి ద్వారానికి అమర్చారు. భక్తుల సందర్శనార్థం ఈ ఇత్తడి తొడుగును మూడు రోజులు గర్భాలయంలో ఉంచుతామని టీడీపీ నాయకుడు బక్కని నర్సింహులు తెలిపారు. కార్యక్రమంలో పూజారి శ్రీనివాసచార్యులు, పట్టణ ప్రముఖులు పలబట్ల బాల్‌రాజ్‌గుప్తా, ఒగ్గు కిషోర్ పాల్గొన్నారు.

కీసరగుట్టకు పోటెత్తిన భక్తులు


శ్రీ రామలింగేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు


స్వామి దర్శనం కోరకు క్యూలైన్లో నిల్చున్న భక్తులు

కీసర, జనవరి 1: కీసరగుట్ట, చీర్యాల్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం సోమవారం సెలవు దినంగా ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రామలింగేశ్వర, చీర్యాల్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలకు భక్తులు తండోపతండాలుగా విచ్చేశారు. ఈమేరకు ఆలయ నిర్వాహకులు ఉదయం స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం అభిషేకాలకు, అర్చనలకు అనుమతించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా క్యూలైన్‌లో ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయంపై ట్రాఫిక్ ఇబ్బంది రాకుండా పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ నిర్వహకులు ప్రముఖులకు ఆశీర్వచనలు అందజేశారు. జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిల నివాసాలకు వెళ్లిన ఆలయ నిర్వాహకులు, అర్చకులు వారికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి శేష వస్త్రాలతో ఆశీర్వదించారు.

అధిక ధరలు వసూళ్లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కీసరగుట్టలో భక్తుల వద్ద అధిక ధరలు వసూళ్లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని భక్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నూతన సంవత్సరం కావడంతో సోమవారం భక్తులు అధిక సంఖ్యల్లో ఆలయానికి విచ్చేశారు. ఇదే అదును చూసుకొని మరుగుదొడ్ల నిర్వహకులు భక్తుల వద్ద నుండి నిబంధనల విరుద్ధంగా అధిక ధరలు వసూళ్లు చేశారు. గమనించిన భక్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మూత్ర విసర్జన ఉచితం, మల విసర్జనకు 5 రూ.లు, స్నానానికి 10 రూ.ల చొప్పున వసూళ్లు చేయాలి, కానీ నిర్వహకులు మూత్ర విసరజనకే 10రూ.లు, మల విసర్జనకు 20 రూ.లు వసూళ్లు చేస్తున్నారు. ఇందేటనీ భక్తులు నిర్వహకులను ప్రశ్నిస్తే మేము, అధికారులకు, పాలక మండల సభ్యులకు ముడుపులు చెల్లించాల్సి ఉంటుందని అధిక రుసుము వసూళ్లు చేయక తప్పదని మరుగుదొడ్ల నిర్వహకులు బాహాటంగా చెబుతున్నారని భక్తులు అధికారులకు తెలియజేశారు. వీటితో పాటు పార్కింగ్, కొబ్బరికాయలు, దర్శనం టిక్కెట్లు కూడా అధికంగా వసూళ్లు చేస్తున్నారని , అధిక ధరలు వసూళ్లు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని భక్తులు అధికారులు తెలియజేశారు.

ఆధార్ కేంద్రాల్లో బారులు

పేరు, చిరునామా మార్పునకు వెల్లువలా జనం



మేడ్చల్‌లోని పోస్టాఫీసు వద్ద బారులు తీరిన జనం

మేడ్చల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల అమలుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణను ముమ్మరం చేసింది. దీనికి తోడు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. వీటన్నింటికీ ఆధార్‌కార్డు తప్పనిసరి. దీంతో వాటి కోసం ఆధార్ కేంద్రాల వైపు ప్రజలు పరుగు తీస్తున్నారు. చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు, మహిళలు చిరునామా, ఇంటి పేరు మార్పునకు కేంద్రాలకు పోటెత్తడంతో నిత్యం రద్దీగా మారుతోంది. ఆధార్ అప్‌డేట్ ఉంటేనే ఐదు గ్యారంటీలకు అర్హులని ప్రచారం జరుగుతుండటంతో ఆధార్‌సెంటర్లు కిటకిటలాడుతున్నాయి. తిండీతిప్పలు మాని గంటల కొద్దీ పడిగాపులు కాస్తున్నారు. అడ్రస్, ఫోన్ నంబర్లు అప్‌డేట్ చేసుకుంటున్నారు. అయితే పథకాల కోసం అప్‌డేట్ చేసుకోవాలని ఎక్కడా చెప్పలేదని అధికారులు చెబుతున్నారు. అవన్నీ వదంతులేనని, దీనిపై తమకు సర్కారు నుంచి ఆదేశాలు రాలేదని ఆధార్‌కార్డు, మీసేవా నిర్వాహకులు తెలుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని కేంద్రాల వద్ద గత వారం రోజులుగా అధికసంఖ్యలో జనం క్యూకట్టారు. వారిని అదుపు చేసేందుకు పోలీసులు బందోబస్తు చేపట్టారు. వారి పహారా నడుమ ఆధార్ నవీకరణ జరుగడం విశేషం. తెల్లవారుజామున 2, 3 గంటల నుంచే ప్రజలు క్యూలైన్‌ల వద్దకు చేరుకుంటున్నారు. ఒక్కోకేంద్రం వద్ద గుమిగూడిన ప్రజలను పోలీసులు చెదరగొట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జనం రద్దీ కారణంగా చిన్నారులతో ఆయా కేంద్రాల వద్ద తల్లిదండ్రులు రోజంతా ఎదురు చూడాల్సివస్తోంది. నిర్వాహకులు రోజుకు 30 టోకెన్లు మాత్రమే జారీ చేస్తుండటంతో టోకెన్‌లను దక్కించుకునేందుకు ప్రజలు తీవ్రఇబ్బందులు పడాల్సివస్తోంది. తీరా వారిసమయం వచ్చేసరికి సాయంత్రం కావడంతో వెనుదిరిగి వెళ్తున్నారు. మార్పులు, చేర్పులు, కొత్తకార్డుల కోసం చేసిన దరఖాస్తులు సరైనపత్రాలు లేకుంటే గెజిటెడ్ అధికారుల సంతకాలు కావాలని సూచించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రోజుకు పదుల సంఖ్యలో రాగా ప్రస్తుతం వందల సంఖ్యలో వస్తుండటంతో ఆధార్ కేంద్రాల నిర్వాహకులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కొన్ని కేంద్రాల్లో ముందుగా దరఖాస్తులు స్వీకరించి వారిని వరుసగా పిలుస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఆధార్ కేంద్రాల పెంపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అదను చూసి అధికంగా వసూళ్లు

జిల్లా వ్యాప్తంగా ఆధార్ కేంద్రాలుండగా అధికంగా పట్టణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఆధార్ మార్పులకు, కొత్తగా నమోదుకు రూ.100నుంచి రూ.150వరకు తీసుకుంటారు. అయితే, రద్దీ పెరగడంతో పలు కేంద్రాల నిర్వాహకులు రూ.350 నుంచి రూ.500వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. అడిగినంత డబ్బులు ఇచ్చిన వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. ఈ విషయం తెలియని వారు కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఆధార్ కేంద్రాల సంఖ్య పెంచాలి



మా బాబుకు ఆధార్‌కార్డు కోసం రెండు రోజులుగా ఆధార్ కేంద్రానికి వస్తున్నా. ఎప్పుడు చూసినా అధిక సంఖ్యలో దరఖాస్తుదారులు ఉంటుండటంతో పనికాకుండా వెళ్లాల్సివస్తోంది. మూడో రోజు తెల్లవారుజామున చలిలో చిన్న పిల్లలతో బహదూర్‌పల్లిలోని ఓఆధార్ కేంద్రానికి వెళ్తే గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది. రోజంతా పట్టింది. ప్రభుత్వం ఆధార్ కేంద్రాల సంఖ్య పెంచాలి.

- వంగాల యాదిరెడ్డి- మేడ్చల్

ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్‌కార్డు తప్పనిసరి. అందుకే కేంద్రాలకు అధికంగా వెళ్తున్నారు. ఈ కేంద్రాలను ఆర్డీవోలు వెంటనే పరిశీలించాలి. నిర్వాహకులు నిబంధనల ప్రకారమే ధర తీసుకోవాలి. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆ ఆధార్ కేంద్రంపై చర్యలు తీసుకుంటాం.

- విజయేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా


అమ్మవారి సన్నిధిలో కాంగ్రెస్ నాయకులు

జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

కడ్తాల్, జనవరి 1: గద్వాల జిల్లా అలంపూర్‌లోని ఐదో శక్తిపీఠం జోగులాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు చేగూరి వెంకటేశ్, బిచ్యనాయక్, జగన్ దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కొత్త సంవత్సరంలో మండలం మరింత అభివృద్ధి సాధించాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు వారు తెలిపారు.

సీఎం, మంత్రులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే


మంత్రి సీతక్కను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌అర్బన్, జనవరి 1: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సోమవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆప్త సచివాలయంలో సీఎంకు పుష్పగుచ్ఛం ఇచ్చారు. అలాగే మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుల కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ముమ్మరంగా కార్యాలయ భవన నిర్మాణ పనులు


తుది దశకు చేరుకున్న కార్యాలయ నిర్మాణ పనులు

కడ్తాల్, జనవరి 1: కడ్తాలలో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జనవరి చివరికల్లా పనులు పూర్తిచేసి ఆఫీసును ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కార్యాలయాన్ని రూ.1.1కోట్లతో నిర్మిస్తున్నారు. నిర్మాణం పనులు తుది దశకు చేరాయి. పనులను త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులకు ఆదేశించారు.

మారిన 'పుర ' సమీకరణాలు

- చేరికలతో తాండూరులో పెరిగిన హస్తం బలం
- తగ్గుతున్న బీఆర్ఎస్ బలం
- మున్సిపాలిటీలో బలబలాలు

పార్టీ	ఎన్నికలకు ముందు	తర్వాత
బీఆర్ఎస్	24	18
కాంగ్రెస్	3	9
బీజేపీ	5	5
ఎంఐఎం	3	3
టీజేఎస్	1	1



తాండూరు, జనవరి 1: తాండూరు మున్సిపాలిటీలో సమీకరణాలు మారాయి. 2025 జనవరి 27 వరకు మున్సిపాలిటీ పాలక మండళ్ల గడువుంది. తాండూరులో గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. ప్రస్తుతం ఉన్న సమీకరణాలు మారిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు కొంత మంది బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం విదితమే. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల బలం పెరగగా, బీఆర్ఎస్ పార్టీకి కౌన్సిల్‌లో బలం తగ్గింది. వికారాబాద్ జిల్లాలోనే పెద్ద మున్సిపాలిటీ తాండూరు. ఈ మున్సిపాలిటీలో 36 మంది కౌన్సిలర్లు నాలుగు కోఆప్షన్ సభ్యులున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, వైస్ చైర్మన్ దీపానర్సిములు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మున్సిపాలిటీలో 24 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉండగా , కాంగ్రెస్ కౌన్సిలర్లు ముగ్గురే ఉండేవారు. బీజేపీకి 5, ఎంఐఎంకు ముగ్గురు, టీజేఎస్ ఒక కౌన్సిలర్ ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో ప్రస్తుతం మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ బలం 4 నుంచి 9 మంది కౌన్సిలర్లకు పెరగడంతో పాటు మిత్రపక్షం టీజేఎస్‌తో 10కి పెరిగింది. బీఆర్ఎస్ పార్టీ 18 మంది కౌన్సిలర్లు ఉన్నారు. బీజేపీ, ఎంఐఎం బలం స్థిరంగా ఉంది. సీపీఎం నుంచి గెలుపొందిన మహమ్మద్ ఆసీఫ్ ప్రస్తుతం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఇండిపెండెంట్లుగా గెలుపొందిన బోయ రవిరాజ్, మహమ్మద్ ముక్తార్ అహమ్మద్ , రాథోడ్ భీంసింగ్‌లు ఇతర పార్టీలో చేరారు. బోయ రవి రాజ్ , రాథోడ్ బీంసింగ్‌లు ముందుగా బీఆర్ఎస్‌లో చేరారు. కౌన్సిళ్ల తర్వాత వచ్చిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముక్తార్ అహమ్మద్ ప్రస్తుతం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు.

మున్సిపాలిటీలో కాంగ్రెస్ వ్యూహామేమిటి?

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావటం, తాండూరులో కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలుపొందటంతో ఇక్కడి మున్సిపాలిటీలో రాజకీయాలపై చర్చ కొనసాగుతుంది. ప్రస్తుతం చాలా మంది ఇతర పార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ప్రధానంగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు కొందరు ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన నాయకులు, కౌన్సిలర్లతో టచ్‌లో ఉంటూ కాంగ్రెస్ పార్టీలో చేరుతామని అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే జరిగితే చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల్లో ఉన్న బీఆర్ఎస్ కౌన్సిలర్ల పదవులకు ఎసరు తప్పదని రాజకీయ పార్టీ పరిశీలకులు భావిస్తున్నారు.

గ్రామీణ రోడ్లన్నీ గుంతలమయం

- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- ఇబ్బందులు పడతున్న జనం
- పట్టించుకోని అధికారులు
- చోద్యం చూస్తున్న ప్రజాప్రతినిధులు


ఆలూర్ మీదుగా శంకర్‌పల్లి వెళ్లే రోడ్డు..

చేవెళ్ల, జనవరి 1: అధికారుల అలసత్వం.. పాలకుల నిర్లక్ష్యం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చేవెళ్ల మండలంలో 37 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలోని దాదాపుగా అన్ని గ్రామాలకు వెళ్లే ప్రధాన గ్రామీణ రోడ్లు పూర్తిగా గుంతలు పడ్డాయి. 9 సంవత్సరాల క్రితం వేసిన బీటీ రోడ్లు పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు రోడ్లు ఎక్కడిక్కడ గుంతలు పడటంతో ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో గ్రామాలకు వెళ్లాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. గుంతల విషయం తెలియని కొత్తగా గ్రామాలకు వస్తున్న అనేకమంది వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారాయని ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం బీటీ రోడ్లు వేస్తామని ఉత్తర్వులు జారీ చేసినా పనులను మాత్రం ఎక్కడా ప్రారంభించలేదు. ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఈ ప్రభుత్వంలోనైనా గ్రామీణ రోడ్ల సమస్యను పరిష్కరించాలని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గుంతల రోడ్లు బాగు చేయించాలి



గుంతల రోడ్లతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. ఆలూర్ గ్రామస్తులే కాకుండా గ్రామం మీదుగా శంకర్‌పల్లి వెళ్లే వాహనదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికలకు ముందు రోడ్డు వేస్తామని చెప్పినా నేటికీ రోడ్డు బాగు చేయలేదు. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. చేవెళ్ల మండలంలో అన్ని గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు బాగు చేయించాలి.

- హబీబ్, ఆలూర్

స్కిల్ డెవలప్‌మెంట్‌తో నిరుద్యోగ యువతకు ఉపాధి

యూనివర్సిటీ ఏర్పాటుపై సర్వత్రా హర్షం



కొడంగల్, జనవరి 1: అన్ని రంగాల్లో వెనకబడిన కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుతో కొడంగల్ రూపు రేఖలు మారనున్నాయి. కడా చైర్మన్‌గా వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, స్పెషల్ ఆఫీసర్‌గా కుంచాల వెంకట్‌రెడ్డిలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో వికారాబాద్ జిల్లా పరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల, కోస్గి, మద్దూర్, కొత్తపల్లి, గుండుమాల్, కొడంగల్, కోస్గి మున్సిపాలిటిలు అభివృద్ధి కానున్నాయి. అందులో భాగంగా తాజాగా ఉమ్మడి జిల్లాల విధానంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కొడంగల్ ప్రాంతంలో వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తున్న ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వికారాబాద్‌కు మంజూరైన స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కొడంగల్ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కనుండటంతో అన్నివర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుతో యువతీ, యువకులకు వృత్తి నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎంతో దోహదపడుతుందని ఈ ప్రాంత ప్రజలు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కడా ఏర్పాటుతో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు నివేదికలు తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గ సమస్యలు, పరిష్కార మార్గాలపై సంబంధిత అధికారులతో చర్చించి అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నారు.

కడా ఏర్పాటుతో నియోజకవర్గం అభివృద్ధి



తెలంగాణ ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ ఆథారిటీ (కడా) ఏర్పాటు చేయడం హర్షణీయం. కడా ఏర్పాటుతో అభివృద్ధితో పాటు నిరుద్యోగ, యువతీ, యువకులకు వృత్తినైపుణ్య కోర్సులతో ఉపాధి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటిని ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయం.

- వేణుగోపాల్, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు, కొడంగల్

స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో ఉపాధి అవకాశాలు



సీఎం రేవంత్‌రెడ్డి కడా ఏర్పాటుతో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనుండటం హర్షించదగ్గ విషయం. కర్ణాటక సరిహద్దులో ఉన్న కొడంగల్ ప్రాంతం ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. సీఎం సొంత నియోజకవర్గంను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టడం సంతోషదాయకం. యూనివర్సిటీ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

- ఆర్.నరోత్తంరెడ్డి, దౌల్తాబాద్ మండలం నందారం



చీరలే శ్రీరామ రక్ష

- తాండూరు మండలంలో 1500 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు
- అడవి పందుల బెడద కాపాడేందుకు పొలాల చుట్టు చీరలతో కంచె

తాండూరు రూరల్: మండల పరిధిలోని రైతులు వేరుశనగ పంట సాగుపై అధిక ఆసక్తి చూపుతున్నారు. తాండూరు మండలం చెంగోల్, చింతామణిపట్నం, పర్వతాపూర్, ఎల్మకన్నె, గోనూరు, నారాయణపూర్, ఖాంజాపూర్, అంతారం, అంతారం తండా, దస్తగిరిపేట్, సిరిగిరిపేట్, అల్లాపూర్ గ్రామాల్లో రైతులు వేరుశనగ పంట సాగుచేశారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో బోరు బావుల కింద కదిరి-6, జేసీ-88, కదిరి-7,9, సీఎంబీ-2, హరితాంధ్ర, అనంత, నారాయణి వంటి రకాల పంటను సుమారు 1500 ఎకరాల్లో సాగు చేశారు. పంట చేతికొచ్చే సమయానికి అడవి పందుల బెడద ఎక్కువైంది. దీంతో పంటను కాపాడేందుకు రైతులు నానా తంటాలు పడతున్నారు. పొలాల చుట్టు చీరలతో కంచె వేసుకుని రక్షించుకుంటున్నారు.


వికారాబాద్: అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిసె లక్ష్మణ్


మాజీ మంత్రి కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాయకులు వడ్లనందు


వికారాబాద్: గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్పీకర్, పక్కనే సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ నాయకుడు రంగరాజు


అనంతగిరి దేవాలయంలో క్యూలైన్‌లో భక్తులు

అంబరాన్నంటిన న్యూఇయర్ సంబురం

- అర్ధరాత్రి హోరెత్తించిన యువత
- రాజకీయ ప్రముఖులకు శుభాకాంక్షల వెల్లువ
- కిటకిటలాడిన ఆలయాలు


తాండూరు: రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


తాండూరు రూరల్: స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసిన సన్మానిస్తున్న తాండూరు ప్రజాప్రతినిధులు

వికారాబాద్, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ఎస్పీ పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ 2023వ సంవత్సరంలో పోలీస్ అధికారులు అందరూ కలసిమెలసి ఉండి సమన్వయంతో పనిచేశారని తెలిపారు. 2024 నూతన సంవత్సరంలో నూతన లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని అందులో కూడా విజయం సాదించాలన్నారు. అనంతరం ఎస్పీ పోలీస్ అధికారులతో కలిసి నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి పోలీస్ అధికారులకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, వికారాబాద్ డీఎస్పీ నర్సింహులు, పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్, డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ హన్మంత్ రావ్, ఏఆర్ డీఎస్పీ విశేషం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్ల నందు సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కాంగ్రెస్ నాయకుడు రంగరాజు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రేవంత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బంట్వారం: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను, జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో ఎంపీపీ, మండల సర్పంచులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో ఎంపీపీ ప్రభాకర్, సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, నర్సింహులు, నాయకులు శ్రీనివాస్, ఎల్లయ్య, రాజు పాల్గొన్నారు.

మర్పల్లి: మర్పల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు కలీమోద్దీన్, రాములుయాదవ్, సర్వేశ్, రాచన్న, జగదీశ్ తదితరులు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పరిగి: 2024 కొత్త సంవత్సరం వేడుకలను ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి తర్వాత డ్యాన్స్‌లు, మందు, విందు జోష్‌లో యువత మునిగితేలారు. ఇళ్లలో మహిళలు, పిల్లలు కూడా కేక్‌లు కట్‌చేసి న్యూఇయర్‌కు స్వాగతం పలికారు. యువకులు ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేసుకున్నారు. సౌండ్స్‌తో గానా, భజనాలతో ఊగిపోయారు. మద్యం మత్తులో తూగిపోయారు. బాణాసంచా కాల్చి నృత్యాలు చేశారు. పరిగిలోని దాబాలు, హోటళ్ల అర్ధరాత్రి వరకు కోలాహలంతో కనిపించాయి. పట్టణంలో పలు స్కూళ్లలో న్యూఇయర్ కేక్‌లను కట్‌చేశారు. కొత్త సంవత్సరం సందర్భంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల పరిధిలోని కళ్లాపూర్‌లోని లొంకాంజనేయస్వామి, కులకచర్ల మండలం పాంబండ, దోమ మండలం మైలారం వెంకటేశ్వరస్వామి, దామగుండం రామలింగేశ్వర ఆలయాల్లో భక్తుల కోలాహలం కనిపించింది. కుటుంబ సమేతంగా పూజలు చేసిన భక్తులు ఏడాదంతా మంచి జరుగాలని దేవుడిని వేడుకున్నారు.


పరిగిలోని సాయిధ్యానమందిరంలో భక్తులు


మోమిన్‌పేట్: చర్చిలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

తాండూరు: తాండూరు ఎమ్మెల్యేను మనోహర్‌రెడ్డి సోమవారం రాష్ట్ర గవర్నర్ తమిళసైని కలిసారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేను గవర్నర్‌కు పరిచయం చేశారు. గవర్నర్‌కు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

తాండూరు రూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తాండూరు మండల ప్రజాప్రతినిధులు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రసాద్‌కుమార్ కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూరు మండలం గౌతాపూర్ సర్పంచ్ రాజప్పగౌడ్, చెంగోల్ మాజీ ఎంపీటీసీ గౌడి వెంకటేశం, కృష్ణయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: నూతన సంవత్సరం 2024ను పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని చర్చిలో క్రైస్తవ సోదరసోదరీమణులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలతో ఏసుక్రీస్తు ప్రభువు అందరిని చల్లగా చూడాలని కోరుకున్నారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్‌లు శైలేష్, విజయ్‌కుమార్, పద్మారావు పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్ పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో చిన్నారులు, యువకులు కేక్‌లు కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం మహిళలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా కొడంగల్ మండలంలోని కర్ణాటక సరిహద్దులో గల మోత్కుపల్లి బలభీమరాయుడి ఆలయంలో స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ జనవరి 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్త సంవత్సరం హుషారుతో యువత పరవళ్లు తొక్కింది. రెండు సంవత్సరాలుగా కరోనా ఆంక్షలతో కొంత మేరకు జోష్ తగ్గిన న్యూఇయర్ వేడుకలు ఈసారి అంతకు మించి జరిగాయి. జిల్లాలో ఎక్కడ చూసినా.. యువత సంబరాల్లో మునిగితేలింది. నగరశివారులో ఉన్న జిల్లాలో పలు రిసార్ట్‌లు, ఫాంహౌజ్‌లు న్యూ ఇయర్ వేడుకలకు వేదికగా మారాయి. మద్యం షాపులు ముందు బారులు తీరాయి. అర్ధరాత్రి నుంచే శుభాకాంక్షలు తెలియజేసేందుకు పోటీపడ్డారు. మగువలు రంగురంగుల రంగవల్లులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఎక్కడికక్కడే కేక్‌లు కట్ చేస్తూ యువత నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. అర్ధరాత్రి దాటిన తరువాత రోడ్లపై మందుబాబుల వీరంగాన్ని అరికట్టేందుకు పోలీసులు గస్తీ ముమ్మరం చేశారు. బార్లు, రెస్టారెంట్లలో రాత్రి 1 గంటల వరకు మద్యం అమ్మకాలు జోరుగా కొనసాగాయి.న్యూఇయర్ సందర్భంగా జిల్లాలోని కీసరగుట్ట, రత్నాలయం, రామలింగేశ్వరస్వామి ఆలయం తదితర ఆలయాలు భక్తుల రద్దీతో నిండిపోయాయి.


ఘట్‌కేసర్: సిబ్బందితో కలిసి కేక్ కట్ చేస్తున్న చైర్ పర్సన్ పావని యాదవ్


ఘట్‌కేసర్: మాజీ మంత్రి మల్లారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కొండల్‌రెడ్డి


ఘట్‌కేసర్ రూరల్: బీఆర్ఎస్ కార్యనిర్వాహణ అధ్యక్షుడు కేటీఆర్‌ను కలిసిన నాయకులు

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ అన్ననగర్‌లోని అమ్మానాన్న వృద్ధాశ్రమంలో సోమవారం జరిగిన నూతన సవత్సర వేడుకల్లో ప్రొఫెసర్ డీఎం ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన భోజన హాలును ప్రారంభించారు. అనతరం కేక్ కట్ చేసి వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు నారాయణ, స్థానికుడు తిరుపతిరెడ్డి, నర్సయ్య, రాంబాబు, ఆర్.జమ్మన్న, ఎం.నర్సింహ పాల్గొన్నారు. అదేవిధంగా ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని మున్సిపల్ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డిని సోమవారం పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి ఆయన స్వగృహంలో కలిసారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట రెడ్డియానాయక్, అక్రమ్‌అలీ, బాలేష్, బి.జగన్మోహన్‌రెడ్డి, కాశయ్య, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి ఏఎంసీ వైస్‌చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డితో పాటు మేడ్చల్ రూరల్ మండలాల బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం సెక్రటరీ సంతోష్‌రెడ్డిలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బోయిన్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం మల్లారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం బీఆర్ఎస్ కార్యనిర్వాహణ అధ్యక్షుడు కేటీఆర్‌ను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో రైతు సేవాసహకార సంఘం డైరెక్టర్ చందుటపట్ల ధర్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ మంకం రవి, బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మర్పల్లి, జనవరి 1: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మర్పల్లి మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని కోటమర్పల్లి గ్రామానికి చెందిన చాకలి బాబు(28) ఆదివారం రాత్రి 10గంటల సమయంలో మర్పల్లి రైల్వే గేటు నుంచి గ్రామానికి నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో మర్పల్లి మండల కేంద్రంలోని ఓ నగల వ్యాపారి లడ్డూ, రాజులు బైక్‌పై వెళ్తూ బాబును వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో బాబు తీవ్రగాయాలపాలవడంతో స్థానికులు మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 63 మందిపై కేసులు

మేడ్చల్ జనవరి 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 63కేసులు నమోదైనట్లు మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని కారణంగా పలు వాహనాలను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

వికారాబాద్ జిల్లాలో 47 కేసులు

వికారాబాద్,జనవరి 01:నూతన సంవత్సరం సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన 47 మందిపైన కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో కట్టుదిట్టంగా బందోబస్తు ఏర్పాటు చేయడం,స్పెషల్ టీంలు,డ్రంక్ అండ్ డ్రైవ్ టీంలు ఏర్పాటు చేయడంతో జిల్లాలో నూతన సంవత్సరం వేడుకలు ప్రశాంతమైన వాతావరణంలో ముగియడం జరిగిందన్నారు.

కారును ఢీకొన్న బైక్.. ఇద్దరికి గాయాలు

పూడూరు, జనవరి 1: కారును ఓవర్‌టేక్ చేయబోయి బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటన పూడూరు మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని మన్నెగూడ సమీపంలో వికారాబాద్ నుంచి మన్నెగూడ వైపు ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తున్నారు. ఇదే సమయంలో ముందు వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వారి ముందు బస్సు ఎదురైంది. బస్సును తప్పించే క్రమంలో కారును వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయి. బాధితులను స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

న్యూఇయర్ వేడుకల్లో ఘర్షణ

- ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు

యాలాల, జనవరి 1: మండల పరిధిలో ఆదివారం రాత్రి న్యూఇయర్ వేడుకల్లో ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు యాలాల ఎస్‌ఐ అరవింద్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. యాలాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు రాజేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో గ్రామంలో వేర్వేరుగా న్యూఇయర్ వేడుకలు ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ వేడుకల్లో రెండు పార్టీలకు చెందిన కార్యకర్తలు గ్రామంలో సావడి దగ్గర ఎదురుపడ్డారు. దీంతో ఒకరినొకరు తోసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉప్పరి శేఖర్‌ను కొప్పుల యాదప్ప, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, నాగారం పాండు, యాదప్ప, బాల్‌రాజ్, నర్సింహులు కలిసి కలిసి కొట్టారని ఆరోపించారు. ఉప్పరి శేఖర్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అరవింద్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మేకలు మృత్యువాత


ఉదనరావుపల్లిలో విద్యుదాఘాతంతో మృత్యువాతపడిన మేకలు

దోమ, జనవరి 1: మండల కేంద్రం అనుబంధ గ్రామం ఉదన్‌రావుపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు మేకలు మృత్యువాతపడ్డాయి. గ్రామానికి చెందిన గొల్ల ఎల్లప్ప తన పొలం దగ్గరికి తీసుకువెళ్తుండగా గ్రామ శివారులో గల కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మేకలు తగిలి అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. మేకల విలువ రూ.20వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకున్నాడు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వెంచర్ నిర్వాహకుడిపై కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 1 : గత నెల 20న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన దర్జాగా బఫర్ కబ్జా కథనానికి ఇరిగేషన్ అధికారులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వెంచర్ నిర్వహకుడు నారాయణరావుచానెల్ కాలువ బఫర్‌జోన్‌ను కబ్జాచేసి వెంచర్ కోసం రోడ్డు వేశారు. గత నెల 28న ఇరిగేషన్ డీఈ ఉషా, ఏఈ అరిగే పరమేష్‌లు పరిశీలించి, కబ్జాను నిర్ధారించి వెంచర్ నిర్వహకునిపై మేడిపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ చెరువులు, కాలువలు, కుంటలు కబ్జాచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు చౌడాపూర్‌లో ఎమ్మెల్యే పర్యటన

కులకచర్ల, జనవరి 1: చౌడాపూర్ మండల పరిధిలో మంగళవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విట్టలాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు. అదేవిధంగా వీరాపూర్, కల్మన్ కాల్వ గ్రామాల్లో జరిగే అభయహస్తం ప్రజాపాలన గ్రామ సభల్లో పాల్గొంటారని తెలిపారు.

స్వచ్ఛ ఘట్‌కేసర్‌గా తీర్చిదిద్దుదాం


ఘట్‌కేసర్‌లో అర్ధరాత్రి పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

ఘట్‌కేసర్, జనవరి 1: ఘట్‌కేసర్ మున్సిపాలిటీని స్వచ్ఛ ఘట్‌కేసర్‌గా తీర్చిదిద్దుదామని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం అర్ధరాత్రి పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ముందుంచడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. మున్సిపల్ సిబ్బంది రాత్రీపగలు ఎంతో శ్రమిస్తున్నారని అన్నారు. అయినప్పటికీ కొందరు చెత్తను వీధుల్లో, రోడ్లపక్కన పడేయడం వల్ల పరిసరాలు పూర్తిగా కలుషితమవుతున్నాయని వాపోయారు. ప్రధానంగా పాత జాతీయ రహదారితోపాటు స్థానిక ఎదులాబాద్ రోడ్డుకిరువైపులా దుకాణదారులు, ప్రజలు చెత్తను బయట వేయకుండా మున్సిపాలిటీకి చెందిన చెత్తసేకరణ వాహనాల్లోనే వేయాలని కోరారు. మున్సిపల్ అధికారులు ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, పోలీసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమసేవా అవార్డుకు ఎంపిక

వికారాబాద్, జనవరి 1: వికారాబాద్ జిల్లా సాయుధదళ కేంద్ర కార్యాలయంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న పల్లె హన్మిరెడ్డి, మడపతి శ్రీశైలం పోలీసు ఉత్తమ సేవా అవార్డుకు ఎంపికైనట్లు రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వీరు ఉన్నతాధికారుల చేతుల మీదుగా త్వరలో అవార్డును అందుకోనున్నారు. మోమిన్‌పేట్ మండలం వెల్చాల్‌కు చెందిన హన్మిరెడ్డి ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా 1996లో ఎంపికయ్యారు. పదోన్నతి పొంది 2009 నుంచి వికారాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నారు. వీరు హెడ్ కానిస్టేబుళ్లుగా అంకితభావంతో విధులు నిర్వహించినందుకుగానూ వీరికి ఈ అవార్డులకు ఎంపిక చేశారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

మేడ్చల్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) జనవరి 1: మేడ్చల్ పట్టణం హౌజింగ్‌బోర్డు కాలనీలో గల అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవార రాత్రి లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి లక్ష దీపోత్సవంలో పాల్గొని భక్తితో దీపాలు వెలిగించారు. ఆలయంలో కృష్ణమూర్తి పంతులు అయ్యప్ప స్వామి మహాపడిపూజ నిర్వహించారు.

శామీర్‌పేట: స్థానికరత్నాలయంలోని శ్రీవేంకటేశ్వస్వామిని, పెద్ద చెరువు కట్టమైసమ్మ, శామీర్‌పేట రేణుక ఎల్లమ్మ, తూంకుంట శ్రీగాయత్రీ అమ్మవార్లను భక్త జనం వేడుకున్నారు. మండలంలోని అలియాబాద్ చౌరస్తా వద్ద గల రత్నాలయానికి ఉదయం ఐదు గంటల నుంచే భక్తుల తాకిడి మొదలయ్యింది. శామీర్‌పేటలోని పెద్ద చెరువు కట్ట మైసమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఉదయం 6గంటల నుంచే భక్తులు క్యూకట్టారు.

శామీర్‌పేట మండల కేంద్రం శామీర్‌పేట శ్రీ వీరభద్రస్వామి ఆలయ ప్రాంతం అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుగుమోగింది. శామీర్‌పేటకు చెందిన అయ్యప్ప భక్తులు సోమవారం శబరిమలకు ఇరుముడి కట్టుకుని తరలివెళ్ళారు. ప్రభాకర్ గురుస్వామి ఆధ్వర్యంలో 25మంది అయ్యప్ప మాల ధారులకు సత్యం గురుస్వామి ఇరుముడి కట్టారు. అదేవిధంగా పద్మరావుగురుస్వామి ఆధ్వర్యంలో తొమ్మిది మంది ఇరుముడి కట్టుకుని శబరిమలకు వెళ్ళారు.

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని అవుషాపూర్, అంకుషాపూర్, ఎదులాబాద్, మర్రిపల్లి గూడ, కొర్రెముల, ప్రతాప్‌సింగారం, వెంకటాపూర్ తదితర గ్రామాలలో శనివారం నూతన సంవత్సరం సందర్భంగా దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎదులాబాద్‌లోని గోదా సమేత శ్రీమన్నార్ రంగనాయకస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా భక్తులు నగరం నుంచి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లారెడ్డి హెల్త్‌సిటీ డైరెక్టర్, ఎమ్మెల్యే తనయుడు చామకూర భద్రారెడ్డి దంపతులు అమ్మవారిని ధర్శించుకొని గాజులు, పట్టువస్త్రాలు సమర్పించారు. సింగిల్ విండో డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి ధనుర్మాసం నెలరోజులపాటు ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరణ చేస్తారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు టీపీ లక్ష్మణచార్యులు, గోవిందాచార్యులు, అధిత్యచార్యులు, భక్తులు పాల్గొన్నారు.


పూడూరు: దామగుండం వద్ద స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు


మేడ్చల్ అయ్యప్ప ఆలయంలో లక్షదీపోత్సవం

మోమిన్‌పేట్: మండలంలోని చక్రంపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీమల్లికార్జునస్వామి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌బీఆర్ఎస్ నాయకులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు డి.వెంకట్, సొసైటి చైర్మన్ బి.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, ఆరీఫ్, జిలానీ, కరీం పాల్గొన్నారు.

పూడూరు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పూడూరు మండల పరిధిలోని దామగుండం రామలింగేశ్వరున్ని భక్తులు దర్శించుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి కొలనులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

తాండూరు: తాండూరు భద్రేశ్వర స్వామి ఆలయంలో శివుడిని వేములవాడ రాజరాజేశ్వర స్వామి అలంకరించి నూతన సంవత్సరం సందర్భంగా భక్తులకు పూజారి విజయకుమార్ దివ్యదర్శనం కల్పించారు.

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వరస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. నూతన ఆంగ్ల సంవత్సరం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి శ్రీ రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవు దినం కావడంతో విద్యార్థులు, యువకులు భారీగా తరలి వచ్చారు.


కులకచర్ల: పాంబండకు తరలి వచ్చిన భక్తులు


కొడంగల్: మోత్కుపల్లి బలభీమరాయుడి ఆలయంలో స్వామి ఆలయంలో భక్తులు


మోమిన్‌పేట్: చక్రంపల్లిలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తదితరులు


ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లోని గోదా సమేత శ్రీమన్నార్ రంగనాయక స్వామి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్న మల్లారెడ్డి హెల్త్‌సిటీ డైరెక్టర్ చామకూర భద్రారెడ్డి దంపతులు, తదితరులు


శామీర్‌పేట నుంచి శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు